కౌంటింగ్ ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులకు వివరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఎన్నికల ఫలితాలు నేడే విడుదల

సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడికి సమయం ఆసన్నమైంది. ఓటు ద్వారా ప్రజలిచ్చిన తీర్పు వెలువడేందుకు ఇక కొన్ని గంటల సమయం మాత్రమే ఉంది. మే 13వ తేదీన ఓటర తన ఓటు ద్వారా తీర్పునిచ్చాడు. ఆ తీర్పు ఫలితం మరో రెండు, మూడు గంటల్లో వెల్లడి కానుంది. ఇవిఎంలో నిక్షిప్తమైన ప్రజా తీర్పు వెలువడేందుకు సమయం ఆసన్నమవడంతో అందరిలోనూ ఒకే ఉత్కంఠత కన్పిస్తోంది. ఎన్నికల సందర్భంగా ప్రజలు ఏమి ఆలోచించారన్నది మంగళవారం నాడు జరగనున్న ఓట్ల లెక్కింపుతో తేలనుంది. ఓటరు నిక్షిప్తం చేసిన తీర్పు నేడు విడుదల కానుండడంతో అటు అభ్యర్థులు, ఇటు ప్రజలందరిలోనూ టెన్షన్ వాతావరణం నెలకొంది.

- ◆ అందరిలోనూ టెన్షన్...టెన్షన్...
- ◆ ప్రజాతీర్పు నేడు వెల్లడి
- ◆ ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- ◆ ఉదయం 7 నుంచే కౌంటింగ్ ప్రక్రియ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఎక్కడా ఎటువంటి ఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లను చేసింది. ఇంకోవైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంది. పోలింగ్ రోజు తాడిపత్రిలో జరిగిన ఘటనలు వంటివి మరోమారు పునరావృతం కాకుండా అవసరమైన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను పూర్తి చేశారు. అనంతపురం జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి జెఎన్‌టియులో ఓట్ల లెక్కింపు జరగనుంది. సత్యసాయి జిల్లాలో హిందూపురం, లేపాక్షి రెండు ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రం చుట్టూ అనుమతి ఉన్న వారిని తప్ప తక్కిన వారెవ్వరని అటువైపు అనుమతించడం లేదు. చుట్టూ దుర్భేధ్యమైన రక్షణను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వైపు వచ్చే అన్ని దారులను మూసివేశారు. సత్యసాయి జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 14,06,204 మంది ఓటర్లు ఉండగా 11,92,287 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆరు నియోజకవర్గాలకు సంబంధించి 78 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. హిందూపురం పార్లమెంట్‌కు 13 మంది బరిలోనున్నారు. అనంతపురం జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20,18,162 మంది ఉండగా 16,36,315 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి అసెంబ్లీకి 113 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అనంతపురం పార్లమెంటుకు 21 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరందరి భవితవ్యం నేడు తేలనుంది.

సర్వత్రా ఉత్కంఠ..!

సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై అనేక ఊహాగానాలు, అంచనాలూ ఉన్నాయి. 2019లో ఉమ్మడి జిల్లాలో ఫ్యాన్ గాలి బలంగా వీచింది. 14 అసెంబ్లీకు 12 స్థానాల్లో వైసిపి గెలుపొందింది. అదే విధంగా రెండు పార్లమెంటు స్థానాలనూ దక్కించుకుంది. ఈసారి ఫలితం ఏ రకంగా ఉండనుందన్నది సర్వత్రా ఉత్కంఠత రేపుతోంది. ఈసారి ఫలితం ఏ రకంగా ఉంటుందన్న దానిపై ఎవరి అంచనాలు వారికున్నాయి. ఎగ్జిట్‌పోల్స్ సర్వేలు వారి అంచనాలను వెల్లడించాయి. అయితే అసలైన ఫలితం నేడు రానుంది. ఇది ఏ రకంగా ఉంటుందన్నది కొన్ని గంటల్లోనే తేలనుంది.

అనంతపురం జిల్లా అసెంబ్లీ బరిలో అభ్యర్థులు

113

అనంతపురం పార్లమెంటుకు అభ్యర్థులు : 21

సత్యసాయి జిల్లా అసెంబ్లీ బరిలో అభ్యర్థులు

78

హిందూపురం పార్లమెంటుకు అభ్యర్థులు : 13

జెఎన్‌టియులో శిక్షణ తీసుకుంటున్న కౌంటింగ్ సిబ్బంది...

అనంతపురం జిల్లా కౌంటింగ్ వివరాలు

నియోజకవర్గం	అభ్యర్థులు	పోస్టల్ బ్యాలెట్	పోలైన ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
రాయదుర్గం	13	1671	2,27,189	14	22
ఉరవకొండ	11	2544	1,92,441	18	15
గుంతకల్లు	14	3612	2,03,820	14	20
తాడిపత్రి	18	2702	2,06,701	14	20
శింగనమల	14	2450	2,05,642	14	21
అనంతపురం	15	6971	1,83,019	14	21
కళ్యాణదుర్గం	15	2614	2,04,297	14	19
రాప్తాడు	13	2614	2,13,207	14	21



శ్రీ సత్యసాయి జిల్లా కౌంటింగ్ వివరాలు

నియోజకవర్గం	అభ్యర్థులు	పోస్టల్ బ్యాలెట్	పోలైన ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
ధర్మవరం	15	2628	2,18,282	14	21
కదిరి	13	3412	2,06,208	14	21
పెనుకొండ	09	2240	2.05.213	14	19
హిందూపురం	13	2054	1,93.882	14	19
మడకశిర	13	1376	1,84,454	14	18
పుట్టపర్తి	15	2318	1,82,083	14	18

పకడ్బందీగా కౌంటింగ్ : ఎన్నికల పరిశీలకులు

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ ఎన్నికలు – 2024 కౌంటింగ్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు మనీష్ సింగ్, సి.అజయ్ నాథ్‌ఝు, అజయ్ కుమార్ ఆదేశించారు. సోమవారం అనంతపురం నగరంలోని జెఎన్టీయులో సాధారణ ఎన్నికల దష్ట్యా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ గౌతమి శాలితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు మనీష్ సింగ్, సి.అజయ్ నాథ్ ఝు, అజయ్ కుమార్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎవరి ప్రభావం ఉండరాదని, నిక్కచ్చిగా వ్యవహరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం కౌంటింగ్‌ను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లనూ పకడ్బందీగా పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటిస్తూ అనంతపురం జెఎన్‌టియులోని మూడు బ్లాక్‌ల్లో ఏర్పాటు చేసిన పార్లమెంట్ నియోజకవర్గానికి, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలియజేశారు. బ్యారీ కేడింగ్, టేబుల్స్, కుర్చీలు, ఏజెంట్లకు సీటింగ్, మౌలిక సదుపాయాలు కల్పన, పటిష్ఠ బందోబస్తు చర్యలు, పార్కింగ్ ఏర్పాట్లు, మీడియా సెల్ ఏర్పాటు, తదితర అన్ని అంశాలపై పరిశీలకులకు వివరించారు. కౌంటింగ్ కేంద్రాల్లో పనులు ఏవీ పెండింగ్ ఉంచకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రిసిటీ బ్యాకప్ సిద్ధంగా ఉంచుకోవాలని, శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. కౌంటింగ్ కోసం అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలన్నారు.

పటిష్ఠ బందోబస్తు : ఎస్పీ

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసేలా బందోబస్తును పటిష్ఠంగా చేపట్టినట్లు ఎస్పీ గౌతమిసాలి తెలియజేశారు. కౌంటింగ్ బందోబస్తు విధుల్లో పాల్గొంటున్న పోలీసు అధికారులతో ఎస్పీ సోమవారం స్థానిక జెఎన్టీయులో ప్రత్యేక సమావేశమయ్యారు. బందోబస్తు విధుల్లో ఏమి చేయాలో.. ఏమి చేయకూడదో దిశానిర్ధేశం చేశారు. కౌంటింగ్ రోజున విధులు చేపట్టే టూవీలర్ మొబైల్ పార్టీలు, స్ట్రాంగ్ రూంల వద్ద బందోబస్తు, జెఎన్‌టియు చుట్టూ పహారా కాస్తున్న పెట్రోలింగ్ పార్టీలు, బైలేన్ పికెట్లు, జెఎన్టీయు వైపు అనుమతి లేని వారు రాకుండా ఆపేందుకు ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు తదితర సిబ్బంది వారి విధులను పూర్తి స్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కర్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసి బాల్ పెన్ / పెన్సిల్, ప్లెయిన్ పేపర్ మినహా ఏవీ అనుమతించకుండా కౌంటింగ్ కేంద్రాల్లోకి పంపాలన్నారు. కౌంటింగు కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలు కట్టుదిట్టంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించినా... చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలనుకున్నా ఎవర్నీ ఉపేక్షించొద్దని ఆదేశించారు.

డిగ్రీ కళాశాలలో 18 నుంచి అడ్మిషన్లు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక కె.టి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి జూన్ 18వ తేదీ నుంచి అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపల్ డాక్టర్ రఘురామ్మూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సకల సదుపాయాలతో, అత్యుత్తమ, అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది కళాశాలలో ఉన్నారన్నారు. బి.ఎ, బీ.కాం, బీ.ఎస్సీ కోర్సులకు సంబంధించి సింగిల్ మేజర్ సబ్జెక్టులు ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు, కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్, మైక్రో బయాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, బాటనీ కోర్సులకు ఇంటర్ పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 90302 60294, 97384 04413, 93986 17197 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

లాడ్జిలు, జాతీయ రహదారుల్లో

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలోని లాడ్జిలతో పాటు రాయదుర్గం-అనంతపురం జాతీయ రహదారిపై సోమవారం పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. కళ్యాణదుర్గం డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, రాయదుర్గం సిఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది ఉదయం పట్టణంలోని లాడ్జిలకు వెళ్లి ప్రతి గదిలో తనిఖీలు చేశారు. అలాగే అందులో విడిది చేసిన వ్యక్తుల వివరాలపై లాడ్జి మేనేజర్లతో ఆరా తీశారు. డీఎస్పీ మాట్లాడుతూ రాయదుర్గం పట్టణంలోని లాడ్జిలలో స్థానికులకు, బయట నుంచి వచ్చిన కొత్త వ్యక్తులకు ఈ నెల ఆరో తేదీ వరకూ రూములు ఇవ్వరాదన్నారు. వ్యాపారులు, ఇతర పని మీద వచ్చిన వారి నుంచి వారి ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ సేకరించడంతో పాటు ఎందుకోసం వచ్చారో విచారించి గదులు ఇవ్వాలన్నారు. అనంతరం రాయద్గురం-అనంతపురం జాతీయ రహదారిపై వైఎస్ఆర్ కూడలి వద్ద పోలీసులు ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా సోదాలు చేశారు.

రాయదుర్గంలో లాడ్జిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

జాతీయ రహదారిపై వాహనాన్ని సోదా చేస్తున పోలీసులు

రాయదుర్గం నియోజకవర్గంలో భారీ వర్షం

నీట మునిగిన పంట పొలాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అనేక చోట్ల పంట పొలాలు నీట మునిగాయి. రోడ్లపై వర్షం నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరా యం కలిగింది. బొమ్మనహాల్‌లో 91 మిల్లీమీటర్లు, కణేకల్లు–80, డి.హీరేహాల్–50, రాయదుర్గంలో 43.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బెళుగుప్ప, కణేకల్లు మండలాల్లో కురిసిన భారీ వర్షానికి వేదవతి నదిలో నీరు ప్రవహించడంతో కణేకల్లు నుంచి మాల్యం ఉరవకొండ ప్రాంతానికి వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. తుంగభద్ర ఎగువ కాలువ గట్టు బలహీనపడడంతో చాలా కాలంగా కాలువపై బస్సులు రాకపోకలను నిలిపివేసి, కణేకల్లు పట్టణం నుంచి వేదవతి నది మీదుగా మాల్యం, ఉరవకొండ వైపు బస్సులు తిరిగేవి. వేదవతి నదిలో నీటి ప్రవాహం పెరగడంతో ఈ మార్గంలో బస్సుల రాకపోకలు స్తంభించాయి. ఎగువ కాలువ గట్టుపై కేవలం ఆటోలు, ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నట్లు హెచ్‌ఎల్‌సి ఇంజనీర్ అల్తాఫ్ తెలిపారు. కణేకల్లు నుంచి ఉరవకొండ, గుంతకల్లు వైపు వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డి.హీరేహాల్ మండలంలోని సోమలాపురం వద్ద గంగమ్మ వంక ఉధృతంగా ప్రవహించడంతో రాయదుర్గం–బళ్లారి మధ్య సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ రాకపోకలు స్తంభించాయి. ఇక్కడ కూడా వంతెన నిర్మించాల్సిన అవసరం ఉంది. మండలంలోని నాగలాపురం, చెర్లోపల్లి గ్రామాల్లో పత్తి పంటలు నీట మునిగాయి. అనేక చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలలో నీరు చేరింది

సోమలాపురం వద్ద గంగమ్మ వంక ప్రవాహంతో నిలిచిపోయిన వాహనాలు

కణేకల్లు- మాల్యం నడుమ ఉధృతంగా ప్రవహిస్తున్న వేదవతి నది

బొమ్మనహాల్ : ఎన్టీఆర్ కాలనీలో నిలిచిన వర్షం నీరు, నీట మునిగిన పత్తి పంట

ఎన్టీఆర్ కాలనీలో ఇళ్లలోకి వర్షం నీరు

బొమ్మనహాల్ : మండలంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పలు వాగులు, వంకలు నీటితో ప్రవహించాయి. పలు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోకి పెద్దఎత్తున నీరు చేరింది. తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో చెట్లు నేలకూలాయి. ఆసుపత్రి ప్రాంగణంలోకి పెద్దఎత్తున నీరు చేరడంతో ఉదయం 10 గంటలైనా 108, 104 వాహనాలు బయటకు కదలలేని పరిస్థితి ఏర్పడింది. స్థానిక ఎన్టీఆర్ కాలనీలో ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో బియ్యం, దుస్తులు, వంట సామగ్రి తడిచిపోయాయని స్థానికులు వాపోయారు. సిద్ధరాంపురం, దర్గాహొన్నూరు, శ్రీధర్‌ఘట్ట, ఏలంజి, లింగదహాల్, గోనెహాల్, గోవిందవాడ దళితవాడల్లో వర్షానికి తడిచి పాత ఇళ్లు కూలిపోయాయి. ఉద్దేహాల్, కొలగానహల్లి, లింగదహాల్, ఉప్పరాల, బండూరు, మైలాపురం గ్రామాల్లో పత్తి పంట పొలాల్లోకి వర్షం నీరు చేరడంతో తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టంపై తహశీల్దార్ కార్యాలయంలో అర్జీలు ఇచ్చినట్లు రైతులు తెలిపారు. వర్షాల ప్రభావంతో ఇళ్లు కూలిపోయిన బాధితులను, పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భక్తజనం మధ్య రుక్మిణీ పాండురంగ స్వామి రథోత్సవం

వైభవంగా రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం

బొమ్మనహాల్ : మండలంలోని ఉంతకల్లు గ్రామంలో వెలసిన రుక్మిణీ పాండురంగ స్వామి రథోత్సవం సోమ వారం అశేష భక్తజనం మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా వేదపండితులు స్వామివార్ల ఉత్సవమూర్తులకు కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చగా రథం ముందు పండరీపురం పీఠాధిపతి గోపాల్‌మహారాజ్ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. దీంతో భక్తులు ఆలయం నుంచి గౌరమ్మ గుడి, పాత సచివాలయం మీదుగా రథాన్ని లాగారు. ఊరేగింపులో భక్తుల పాండురంగ స్వామి నామస్మరణ మార్మోగింది. స్వామి దర్శనార్థం మండలం నుంచే కాకుండా ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సెక్షన్ 144, పోలీసు చట్టం 30 ఆంక్షలు అమలులో ఉన్నందున ఎక్కడా నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడి ఉండరాదని కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు హెచ్చరించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 6వ తేదీ వరకూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఓట్ల లెక్కింపు రోజు ఫలితాల తర్వాత రాజకీయ పార్టీలు, ప్రతినిధులు విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అల్లర్లకు పాల్పడితే జిల్లా బహిష్కరణ చేస్తామన్నారు. గతంలో క్రిమినల్ కేసులు ఉండి ఇప్పుడు కూడా వారిపై కేసులు నమోదైతే పీడీ చట్టం కూడా అమలు చేస్తామన్నారు. అలాంటి వారికి ఏడాది జైలు శిక్ష ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు తర్వాత టపాసులు పేల్చడం, నిల్వ ఉంచడం, వినియోగించడం చేయరాదన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, వ్యాపారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు ఇళ్లలోనే ఉండి ప్రశాంత వాతావరణంలో ప్రసార మాధ్యమాల ద్వారా ఓట్ల లెక్కింపు సమాచారం తెలుసుకోవాలన్నారు. నియోజక వర్గంలో ఎన్నికల సందర్భంగా 1,585 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా మొబైల్ స్ట్రైకింగ్ ఫోర్సులతో 11 గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా శాంతి భద్రతలకు భంగం వాటిల్లితే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. డీఎస్పీతో పాటు రాయదుర్గం సిఐ శ్రీనివాసులు, మండల స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అల్తాఫ్ ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

డిఐజి రాహుల్‌దేవ్‌శర్మ



మండల వివరాలను ఎస్ఐతో తెలుసుకుంటున్న డిఐజి రాహుల్‌దేవ్‌శర్మ

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరైనా అలర్లు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిఐజి రాహుల్‌దేవ్‌శర్మ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను డిఐజి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలు, రౌడీషీటర్లు, పలురకాల కేసులు తదితర అంశాలపై ఎస్ఐ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామాలకు కేటాయించిన పోలీసు సిబ్బంది ఎలా పని చేస్తున్నారు.. ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో ఎలా ఉంటుందనే విషయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘర్షణలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించే ఎవరైనా ఉపేక్షించకుండా జిల్లా బహిష్కరణ కేసులు నమోదు చేయాలన్నారు.

కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

జిల్లా కేంద్రంలో తనిఖీలు ముమ్మరం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యేందుకు మరికొన్ని గంటలు మాత్రమే వ్యవధి మాత్రమే ఉండటంతో ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. అనవసరమైన వ్యక్తులు కౌంటింగ్ జరిగే జిల్లాకేంద్రంలోకి తరలివచ్చి ఏవైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడే అవకాశం ఉండకూడదనే ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పోలీసులు వాహనాలు తనఖీ ముమ్మరం చేశారు. అనంతపురం లోపలికి వచ్చే మార్గాల్లో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సాధారణ ప్రజలకు ఎలాంటి ఆటంకం, అసౌకర్యం కలిగించకుండా తనిఖీలు కొనసాగుతున్నాయి. అనుమానితులు, నేరచరిత కలిగిన వారు, ఇదివరకే గొడవలు, అల్లర్లు, హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న వ్యక్తులు ఎవరిని జిల్లా కేంద్రంలోనికి రాకుండా చెకింగ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోకి వచ్చే రహదారులపైనే కాకుండా ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్లు, రహదారులపై తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

విద్యుత్ స్తంభం మార్పు

పామిడి : మండల కేంద్రంలోని ఎద్దులపల్లి రోడ్డు సర్కిల్ ముత్యాలమ్మ సత్రం ఎదురుగా ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఎట్టకేలకూ అధికారులు మార్చారు. పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభంపై ప్రజాశక్తి దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన విద్యుత్ అధికారులు సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని వంగిపోయిన విద్యుత్ స్తంభాన్ని తీసివేసి కొత్త స్తంభాన్ని అమర్చి వైరు కనెక్షన్ ఇచ్చారు. ప్రజాశక్తి కథనానికి అధికారులు స్పందించినందుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే నాన్ బెయిలబుల్ కేసులు

టౌన్ డీఎస్పీ టీవివి.ప్రతాప్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లకు దిగితే ఎలాంటి వారినైనా ఉపేక్షించకుండా నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని అనంతపురం డీఎస్పీ టీవివి.ప్రతాప్ హెచ్చరించారు. సోమవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా గొడవలకు దిగితే నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడంతోపాటు జిల్లా బహిష్కరణకు కూడా వెనుకాడబోమన్నారు. కౌంటింగ్ జరిగే జెఎన్‌టియు పరిసరాల్లోని మూడు కిలోమీటర్ల పరిధిలో దుకాణాలు తెరవరాదన్నారు. అయా పరిధిలోని ఇళ్లలో కొత్త వ్యక్తులు, బంధువులు ఉండరాదని నోటీసులు జారీ చేశామన్నారు. జెఎన్‌టియు పరిధిలోకి అభ్యర్థులు, కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు రావడానికి కేవలం రెండు మార్గాలు మాత్రమే ఏర్పాటు చేశామన్నారు. నగరంలో నుంచి వచ్చే వారు హిందూ శ్మశానవాటిక వద్ద, రాప్తాడు నుంచి వచ్చేవారు రేణుకా గేటెడ్ కమ్యూనిటీ నుంచి జెఎన్‌టియు పరిధిలోకి రావాలన్నారు.

బయటి వ్యక్తులు వస్తారని సమాచారం

కౌంటింగ్ సందర్భంగా అల్లర్లు సృష్టించేందుకు సమస్యాత్మక ప్రాంతాల నుంచి బయటి వ్యక్తులు వస్తారన్న సమాచారం ఉందన్నారు. పోలీసుల కళ్లుగప్పి వచ్చి అల్లర్లకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించి జిల్లా బహిష్కరణ చేస్తామన్నారు. కాబట్టి కౌంటింగ్ పూర్తయ్యేవరకు బయటి వ్యక్తులు నగరంలోకి ప్రవేశించరాదని సూచించారు. నగరంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పికెటింగ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

మలేరియా నివారణకు కృషి

వైద్యాధికారిణి అరుణకుమారి

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-వజ్రకరూరు

ప్రజల భాగస్వామ్యంతో మలేరియా నివారణకు కలిసికట్టుగా కృషి చేద్దామని వైద్యాధికారిణి అరుణకుమారి పిలుపునిచ్చారు. మలేరియా వ్యతిరేక మహోత్సవంలో భాగంగా సోమవారం విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాఫిలాస్ అనే ఆడ దోమకాటు వల్ల మలేరియా వ్యాధి వస్తుందన్నారు. ఈ దోమలు నీటిలో గుడ్లు పెట్టి అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కావున ఇంట్లోగానీ, పరిసరాల్లోగానీ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. మలేరియా జ్వరం వచ్చిన వారికి మొదట చలి వేసి, జ్వరం వచ్చి తర్వాత చెమటలు పట్టి జ్వరం విడిచి పెడుతుందన్నారు. ఇలాంటి లక్షణాలు ఉంటే మలేరియాగా భావించి వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, యశోద, స్టాఫ్‌నర్స్ జయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, వాసు, ఎంఎల్‌హెచ్‌పి సుశీల, ఎఎన్‌ఎం సీతమ్మ,ఆశ,అంగన్వాడి,ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమర్ ఆలీషా సాహిత్యానికి విస్తృత ప్రచారం

సీనియర్ రచయిత పతికి రమేష్ నారాయణ

కవి కరణం హరికిశోర్‌ను సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

కవి, స్వాతంత్ర్య సమరయోధుడు, దార్శనికుడు డాక్టర్ ఉమర్ అలీషా సాహిత్యానికి విస్తృత ప్రచారం కల్పిస్తామని డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి గౌరవ సలహాదారులు, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ అన్నారు. భీమవరం ఉమరాలిషా సాహితీ సమితి వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతగా నిలిచిన కవి, ఉపాధ్యాయుడు కరణం హరికిశోర్‌కు ఆదివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హరికిషోర్ ఆంగ్ల ఉపాధ్యాయుడు అయినప్పటికీ తెలుగు సాహిత్యం పట్ల ఎంతో మక్కువతో కవితలు పాటలతో సమాజ చైతన్యం తెస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సద్గురువులు డాక్టర్ ఉమర్ అలీషా పీఠాధిపతుల నుంచి విచ్చేసిన జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య భారతి వ్యవస్థాపక అధ్యక్షులు గుంటి మురళీకృష్ణ, ద్విభాషా కవి జూటూరు షరీఫ్, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, డాక్టర్ నగరూరు రసూల్, అనంతపురం పత్రిక సంపాదకుడు తోట నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తో గొర్రెలు మృతి

తనకల్లు : మండల కేంద్రంలోని ఇందిరానగర్ లో ఆదివారం రాత్రి జరిగిన విద్యుత్ ప్రమాదంలో తనకల్లుకు చెందిన మౌలాలి అనే గొర్రెల కాపరికి చెందిన 8 గొర్రెలు మృతిచెందాయి

కసాపురం ఆలయంలో పూజలు

శింగనమల : శింగనమల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ గెలవాలని కోరుతూ టిడిపి నాయకులు సోమవారం కసాపురం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అబ్జర్వర్ గుర్రప్పనాయుడు, అనంతపురం టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయేది ఎన్‌డిఎ ప్రభుత్వం అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా, శింగనమల ఎమ్మెల్యేగా బండారు శ్రావణశ్రీ అత్యధిక మెజార్టీ గెలవాలని పూజలు చేసినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

బావిలో పడి విద్యార్థి మృతి

మృతిచెందిన రాజేష్

నార్పల : మండల కేంద్రంలోని కొండంక వద్ద నివాసం ఉన్న పల్ల నారాయణస్వామి మనువడు మెకానిక్ గాండ్ల లక్ష్మీపతి కుమారుడు రాజేష్ (16) తన తోటలో ప్రమాదవశాత్తు బావిలో కాలుజారి పడి మృతిచెందాడు. రాజేష్ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తయింది. చేతికందిన కుమారుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని రాజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్య

శిల్ప (పాతచిత్రం)

బెలుగుప్ప : కుటుంబ కలహాలతో ఉప్పర శిల్ప (30) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఉప్పర హనుమంతు కుమారుడు ఉప్పర మంజునాథ చిత్రదుర్గం జిల్లా భలేకట్టు గ్రామానికి చెందిన ఉప్పర శిల్పతో 8ఏళ్ల క్రితం వివాహమైంది. కొద్దిరోజులుగా వీరి దాంపత్యం సంతోషంగానే సాగింది. ఈనేపథ్యంలో 15 రోజుల కిందట భార్యాభర్తల మధ్య చిన్న గొడవల కారణంతో శిల్ప పురుగుల మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడింది. అయితే పెద్దల పంచాయతీ చేయగా భార్యాభర్తలు కలిసి సంతోషంగా ఉండాలని తీర్మానించారు. అయితే సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా బంధువులు గమనించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు తెలిపారు. శిల్ప తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బెలుగుప్ప ఎస్ఐ శివ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గాయపడిన నవీన్

గుత్తి : మండలంలోని యంగన్నపల్లి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో గుత్తి మండలం బేతాపల్లి గ్రామానికి చెందిన నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అతన్ని అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పెన్నహోబిలం ఆలయ మాజీ డైరెక్టర్ మృతి

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

వజ్రకరూరు : వైసిపి నాయకులు, పెన్నోబిలం ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్ పెద్ద ముష్టూర్ అర్జునప్ప (63) సోమవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఇంట్లో ఉన్నట్టుండి కళ్లు తిరిగి పడిపోవడంతో వెంటనే ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డితోపాటు పలువురు వైసిపి నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్జునప్ప మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. నివాళులర్పించిన వారిలో ఎంపిటిసి ఓబయ్య, వంకాయల గోవిందు, బోయ వెంకటేసులు, రామకృష్ణ, రమేష్, గోపాల్, సుభాష్, వెంకటేశులు, కేసన్న, గురుప్రసాద్, తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణం వద్ద క్యూలో ఉన్న మద్యం ప్రియులు

మద్యం దుకాణం వద్ద బారులు

పుట్లూరు : మండల కేంద్రంలోని మద్యం దుకాణం వద్ద మందుబాబులు సోమవారం బారులుదీరారు. నేడు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సోమవారం సాయంత్రం నుంచి మద్యం దుకాణాలను మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చాలామంది బందుబాబులు సోమవారం ఉదయం నుంచి మండల కేంద్రంలోని మద్యం దుకాణం వద్ద బారులుదీరి మద్యం తీసుకెళ్లారు.

గ్రామాలు వదిలి వెళ్లకండి : సిఐ

పుట్లూరు : పుట్లూరు, యల్లనూరు మండలాల ప్రజలకు మంగళవారం గ్రామాలను వదిలి వెళ్లవద్దని సిఐ సుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. కావున ప్రజలతోపాటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తాడిపత్రి, అనంతపురానికి వెళ్లకూడదన్నారు. అలాకాకుండా వెళ్లినట్లయితే అలాంటి వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఫలితాల అనంతరం గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, బాణాసంచా కాల్చడం చేయకూడదన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించి తమ ఇళ్లలో ఉండాలని కోరారు.

అవసరం ఉంటేనే బయటికి రండి : ఎస్ఐ

నార్పల : నేడు సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రజలు అవసరం ఉంటేనే బయటకు రావాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా మండల మొత్తం నిఘానేత్రంలో ఉందన్నారు. మండల కేంద్రంలోని పలు కూడళ్లు, సమసాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అంతేగాకుండా జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఫలితాలు వచ్చాక ఎవరైనా అల్లర్లకు పాల్పడినా.. కవ్వింపు చర్యలకు దిగినా.. బాణాసంచా కాల్చినా.. గుంపులు గుంపులుగా జనాలున్న.. సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యే ప్రమాదం ఉందన్నారు. వాటి ఆధారంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కంపచెట్లు తొలగింపు

కంపచెట్లను తొలగిస్తున్న జెసిబి

పామిడి : మండలంలోని ఎద్దులపల్లి గ్రామం నుంచి పొలిమేర వరకూ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను వైసిపి నాయకులు వీరాంజనేయులు సోమవారం జెసిబి ద్వారా తొలగించారు. రోడ్డుకిరువైపులా కంపచెట్లు పెరగడంతో స్థానికులు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకట్రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంకట్రామిరెడ్డి ఆదేశాల ప్రకారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించినట్లు వీరాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బళ్లారి దుర్గమ్మను దర్శించిన గుమ్మనూరు ఈశ్వర్

పూజలు చేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

పామిడి : గుంతకల్లు నియోజకవర్గ ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్ సోమవారం బళ్లారి దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో సోమవారం బళ్లారి పట్టణంలో వెలసిన దుర్గమ్మ తల్లి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల ఫలితాల్లో తన తండ్రి గుమ్మనూరు జయరామ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని అమ్మవారిని వేడుకున్నారు.

పెన్నహోబిలం ఆలయ హుండీ లెక్కింపు

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

వజ్రకరూరు : పెన్నోబిలం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలు, ఆరు శాశ్వత హుండీలు, శ్రీ ఉద్భవ లక్ష్మి అమ్మవారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించగా రూ.17,21,128 ఆదాయం సమకూరింది. అలాగే అన్నదాన సత్రం హుండీ ద్వారా రూ.3611 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.విజయ్‌కుమార్, బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి బి.అక్కిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ హనుమాన్ సేవాసమితి సభ్యులు, ఔట్‌పోస్ట్ పోలీస్ ఎ.అయూబ్‌బాషా, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE V JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 1430 of 2023
Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr. anager(Law)&Authorized Officer, ...Plaintiff
And
Smt.Peta Revathi ...Defendant
To
Smt.Peta Revathi, W/o.D.Seetharam Reddy, Aged about 47 Years, Occ: Business, R/o.Flat No.204, Rajahamsa Palace, R.T.C Bus Stand Road, Anantapur, A.P-515001.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs. 5,09,043-96ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 03-07-2024. In case of your failure to attend before the Court on 03-07-2024 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.
(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate
Advocates, Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.

భారీ వర్షంతో పొంగిన వాగులు, వంకలు

పెద్దవడుగూరు మండలంలో పారుతున్న వంకలు, తెగిన రోడ్డు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలవ్యాప్తంగా ఆదివారం రాత్రి కురిసిన భారీవర్షాలకు వాగులు, వంకలు పొంగిపోర్లగా రాకపోకలు స్తంబించాయి. ముఖ్యంగా గుత్తి వైపు భారీ వర్షాలు కురవడంతో మండలంలోని పందులవాగు, పులేటి వాగులు ఉధృతంగా ప్రవహించాయి. తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో పెద్దవడుగూరు నుంచి ఉపాధ్యాయుడు కుమార్ ఎన్నికల లెక్కింపు నిమిత్తం విధులకు ద్విచక్రవాహనంలో వెళ్తూ వాగులో పడిపోయాడు. అయితే అక్కడున్న కొందరు అతన్ని రక్షించి బయటకు లాగడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే వాహనం, చరవాణి, బ్యాగు వాగులో కొట్టుకుపోయాయి. అయినప్పటికీ వాగు ఉధృతి తగ్గాక అనంతపురం వెళ్లిపోయారు. అలాగే వీరన్నపల్లి సమీపంలో ఉన్న పులేటి వాగుపై ఉన్న రహదారి వర్షాలకు కోతకు గురై రాకపోకలు ఆగిపోయాయి. ఏటా పడే వర్షాలకు ఈవాగు ఉధృతంగా ప్రవహించి రోడ్డు కోతకు గురై అటూఇటూ రాకపోకలు ఆగిపోవడం పరిపాటిగా మారింది. కనీసం ఏటా ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, పాలకులు ఈవాగులపై కల్వర్టులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా పెద్దవడుగూరులో 56.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

బెలుగుప్ప : మండలంలో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మంగోటి చెరువు నిండుకుండను తలపిస్తోంది. బెలుగుప్ప పెద్దవంక, అనకనహాల్ వంక బ్రిడ్జిపై నీరు పారడంతో ఉరవకొండ, అనంతపురం నుంచి బెళుగుప్ప వచ్చే రాకపోకలు నిలిచిపోయాయి. మండల వ్యాప్తంగా 84.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా వర్షం రాకతో ఖరీఫ్ సాగుకు మంచి అదన అయింది. దీంతో రైతులు సాగులో నిమగ్నమయ్యారు.

గెలుపు మనదే..సంయమనం కోల్పోవద్దు : దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరట్

జూన్ 4న (రేపు) జరగనున్న కౌంటింగ్ లో ఖచ్చితంగా మనం విజయం సాధించబోతున్నామని.. ఎవరూ ఎలాంటి అనుమానాలు, అపోహలు పెట్టుకోవద్దని అనంతపురం అర్బన్ టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకుల్ని, కౌంటింగ్ ఏజెంట్లను ఉద్దేశించి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మనం గెలుస్తున్నామని.. ఖచ్చితంగా టీడీపీ అధికారంలోకి రాబోతోందని... సర్వేలన్నీ కూడా అదే చెబుతున్నాయన్నారు. ఇలాంటి సమయంలో మనం కౌంటింగ్ సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. పార్టీ శ్రేణులెవరూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని.. ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడినా సంయనం కోల్పోవద్దన్నారు. ఎన్నికల కమిషన్, అలాగే పోలీసుల నిబంధనల ప్రకారం మనం నడుచుకుందామన్నారు. మనకు ఎవైనా ఇబ్బందులు కల్గితే.. పోలీసులు, ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్దామన్నారు. గెలుపు తర్వాత ఎవరూ రోడ్లపైకి రావడం.. ప్రత్యర్థులనుద్దేశించి వ్యాఖ్యలు చేయవద్దని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలకు దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

కలుషితాహారం తిని అస్వస్థత

ముదిగుబ్బ : మండలం మంగలమడక గ్రామంలో ఒకే కుటుంబంలోని నలుగురు వ్యక్తులు ఆదివారం విషాహారం తిని అస్వస్థతకు గురయ్యారు. వారు తమ ఇంట్లో వండుకున్న ఆహారం తిని సోమవారం తెల్లవారుజామున నుండి వాంతులు విరేచనాలతో ఆసుపత్రికి చేరారు. ఒకే కుటుంబానికి చెందిన పద్మావతి, రామచంద్రమ్మ, జయరాజు, నిఖిల్ అస్వస్థతకు గురవటంతో మెరుగైన వైద్యం కోసం బత్తలపల్లి ఆర్‌డిటి ఆస్పత్రికి తరలించారు.

రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టొద్దు

ప్రజాశక్తి-శింగనమల

ఎవరైనా వాట్సప్, ఫేస్‌బుక్‌లలో రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెడితే కేసు నమోదు చేయడంతోపాటు రౌడీషీట్ ఓపెన్ చేసి జైలుకు పంపుతామని ఎస్ఐ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. శింగనమల పోలీసుస్టేషన్ పరిధిలో ఉండే గ్రామాల ప్రజలు ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప అనంతపురం వెళ్లకూడదన్నారు. జిల్లాలో 144 సెక్షన్‌తోపాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా కనబడితే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. నలుగురు కంటే ఎక్కువ జనాలు ఎక్కడ కనిపించినా కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కించపరిచే పోస్టులు చేసినా, గ్రూప్ అడ్మిన్, స్టేటస్‌గా పెట్టుకున్నా క్రిమినల్ కేసులు నమోదు చేసి రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.